వైభవంగా లష్కర్ మహంకాళి బోనాలు

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి • బోనం సమర్పించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

బేగంపేట, జూలై 21: సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి జాతర సందర్భంగా లష్కర్‌లో అధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని బంతి పూలతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి బోనం సమర్పించగా.. 8.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా అమ్మవారికి బోనం సమర్పించారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు దేవాదాయ శాఖతో పాటు పోలీస్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సాధరణ భక్తులకు 3, బోనాలు సమర్పించే మహిళలకు 2, వీఐపీలకు ఒక క్యూలైన్ ఏర్పాటు చేశారు. దీంతో అనేక మంది భక్తులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం జలమండలి అధికారులు తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. జాతరను తిలకించేందుకు వివిధ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలోని భక్తులకు జీహెచ్‌ఎంసీ సిబ్బందితోపాటు వివిధ విభాగాల వలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

నూలుపోగే.. ఉరితాడు!

మొదటిపేజీ తరువాయి...

కొవిడ్ కాలంలోనూ చీరల పంపిణీని కొనసాగించింది. ఏటా మహిళలకు కోటి చీరల దాకా కానుకగా అందించింది. 25 నుంచి 30 విభిన్న డిజైన్లలో సుమారు 240 రకాల చీరలను పది రంగుల్లో పంపిణీ చేసింది.

ఇందుకు ఏటా ప్రభుత్వం రూ.320 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకు ఖర్చు చేసింది. వీటిలో 90 శాతం వరకు చీరల తయారీ ఆర్డర్లను జనవరిలోనే సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్ చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చేది. చీరల తయారీ ఏప్రిల్ నుంచి అక్టోబర్ దాకా కొనసాగేది. దాదాపు 15 వేల పవర్‌లూమ్స్ కార్మికులకు చేతినిండా పనిదొరికేది. పేద మహిళలు, చేనేత, అనుబంధ కార్మికులు, ఇతరులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు నేటికీ ఇవ్వకపోవడంతో ఒక్కసారిగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడింది. పవర్‌లూమ్స్‌లో పనిలేక, బాధలు తాళలేక నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇటీవల పద్మశాలి సంఘం, చేనేత సహకార సంఘం ప్రతినిధులు చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి నేత కార్మికుల సమస్యలు, పరిశ్రమ సంక్షోభం గురించి వివరించారు. ప్రభుత్వ పరంగా అండగా నిలవాలని కోరారు. నేతల ఆత్మహత్యలు ఆగాలంటే తక్షణమే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కానీ, ఆర్డర్లపై స్పష్టంగా చెప్పకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మంత్రి చెప్పారని నేతలు పేర్కొన్నారు.

కరెంట్ యూనిట్ ధర పెంచిన కాంగ్రెస్

బీఆర్ఎస్ ప్రభుత్వం 4వ క్యాటగిరీ కింద పవర్‌లూమ్స్‌కు విద్యుత్తును రూ.4కు యూనిట్ చొప్పున సరఫరాచేసింది. ఇందులో రూ.2 సబ్సిడీ పోను రూ.2 మాత్రమే చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్తును 3వ క్యాటగిరీ కిందకు మార్చడం వల్ల యూనిట్‌కు రూ.8.5 చెల్లించాల్సి వస్తున్నది. 10 హెచ్‌పీ సామర్థ్యం దాటిన పవర్‌లూమ్స్ యాజమానులు యూనిట్‌కు రూ.8.5 చెల్లించాల్సి వస్తున్నందున పదిలూమ్స్ ఉన్న యజమాని ఒక్క కార్మికుడితో ఆరు లూమ్స్‌నే నడిపిస్తున్నాడు. ఫలితంగా చాలా మందికి పనిలేకుండా పోతున్నది. నేతన్న బీమా, త్రిఫ్ట్, నేతన్న చేయూత పథకాలు కూడా సక్రమంగా అమలుకావడం లేదు. నేత కార్మికులను యజమానులు చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం రూ.350 కోట్లతో సిరిసిల్లలో 'వర్కర్ టు ఓనర్' షెడ్లను నిర్మించింది. విద్యుత్తు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించింది. కేవలం లూమ్స్ ఏర్పాటు చేయడమే మిగిలింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో వర్కర్ టు ఓనర్ షెడ్ల వ్యవహారం నిలిచిపోయింది. లూమ్స్ రాకపోవడంతో నేత కార్మికుల శాశ్వత ఉపాధికి గండి పడింది. లూమ్స్ బిగిస్తే 1100 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

ఆగిన సంక్షేమ పథకాలు

గత కేసీఆర్ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు, ఇతర కార్యక్రమాలు అమలుచేసింది. బడ్జెట్ కేటాయింపులూ పెంచింది. మగ్గాల ఆధునికీకరణకు ఆర్థికసాయం అందించింది. రుణాలు మాఫీచేసింది. మార్కెట్ అనుసంధానం వంటి చర్యలు చేపట్టింది. వర్క్ ఆర్డర్లు పెంచింది. బతుకమ్మ చీరల ఉత్పత్తి, స్కూల్ యూనిఫామ్‌ల తయారీ వంటి పనులు అప్పగించింది. ఈ చర్యలు చేనేత పరిశ్రమకు పునర్జీవాన్నిచ్చాయి. ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకొచ్చాయి. చేతి నిండా పని దొరకడంతో నేతన్నల ఆత్మహత్యలు ఆగిపోయాయి. గతంలో మహారాష్ట్రలోని భీవండికి ఉపాధి కోసం వలస పోయిన నేత కార్మికులు తిరిగి స్వస్థలాలకు చేరుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను కొనసాగించడంలో రేవంత్‌రెడ్డి సర్కారు విఫలమైంది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో పడింది.

నేత కార్మికుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన ముఖ్యమైన పథకాలు

చేనేతరంగం

1. పావలా వడ్డీ పథకం
2. మగ్గాల ఆధునికీకరణ
3. చేనేత వస్త్ర ప్రదర్శన
4. చేనేత రంగంలో శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పన
5. మార్కెట్ ఇన్సెంటివ్స్
6. హ్యాండ్లూం పార్కు గద్వాల

పవర్ లూం రంగం

1. సిరిసిల్ల టెక్స్ టైల్ పార్కు
2. మినీ టెక్స్‌టైల్ పార్కు వరంగల్
3. టీ-టీఏపీ 2017-2020
4. సిరిసిల్ల అప్పరెల్ పార్కు
5. వర్కర్-టు-ఓనర్ పథకం
6. మరమగ్గాల సేవా కేంద్రం ఏర్పాటు
7. మరమగ్గాలకు వినియోగించే విద్యుత్తు పై 50% సబ్సిడీ
8. మరమగ్గాల ఆధునినికీకరణ

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు

- చేనేత మిత్ర పథకం కింద ముడిసరుకు కొనుగోలుపై 40 శాతం సబ్సిడీ
- నేతన్నకు చేయూత పథకం కింద పొదుపు చేసుకునే 8 శాతం వేతనానికి ప్రభుత్వం 16 శాతం కలిపి ఖాతాలో జమ
- రుణమాఫీ పథకం కింద ఏప్రిల్ 2010 నుంచి మార్చి 2017 వరకు రూ.28.96 కోట్ల రుణాల మాఫీ. ఫలితంగా ఒక్కొక్కరికి రూ.లక్ష వరకు మాఫీ అయింది. 10,148 మంది చేనేత కార్మికులకు లబ్ధి కలిగింది.
- కార్మికులెవరైనా మరణిస్తే అతడి కుటుంబానికి నేతన్న పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థికసాయం
- నేత కార్మికుల నైపుణ్యతను గుర్తించి వారికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డుల ప్రదానం
- పావలా వడ్డీ పథకం, మార్కెటింగ్ ప్రోత్సాహకాలు
- చేనేత సంఘాలకు 49 కామన్ వర్క్ షెడ్ల నిర్మాణం
- ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులంతా చేనేత వస్త్రాలు ధరించాలనే నియమం
- బతుకమ్మ చీరెల ఆర్డర్లు, పిల్లల యూనిఫామ్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించే వస్త్రాల ఆర్డర్లు

కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి

> తెలంగాణలో జనవరి నుంచి ఇప్పటి వరకు 12 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. నేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. చేనేత కార్మికులకు ప్రయోజనం, పని కల్పించే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దీనివల్ల నేత సమాజంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి కనీసం మందులు కూడా కొనలేని దీనస్థితిలో నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.
> -కే తారక రామారావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఆర్డర్లు ఇవ్వక నోటికాడి బుక్కను ఎత్తగొట్టిన్రు

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వక నోటికాడి బుక్కను కాంగ్రెస్ నేతలు ఎత్తగొట్టిన్రు. జనతా వస్త్రాలు, ఇందిరమ్మ చీరెల పేరుతో అయినా పథకాన్ని కొనసాగించాలి. రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చినట్టు చేనేత రంగానికి కూడా ఇవ్వాలి. కరెంటు సమస్య, బతుకమ్మ చీరలు, బకాయిలు, మార్కెట్ వసతి కల్పన కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయాలని నిర్ణయించాం. రాష్ట్ర బడ్జెట్‌లో భారీ బడ్జెట్ కేటాయిస్తామని, నేత కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకోని పక్షంలో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతాం.

-మూశం రమేశ్- పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీ ఇలా..

2017 95,48,439	2018 96,70,474
2019 96,57,813	2020 96,24,384
2021 96,38,000	2022 96,42,000
2023 1.02 కోట్లు	

ఏడు నెలల్లో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికులు

మృతుడి పేరు	తేదీ	ఘటనాస్థలం
1.గుగ్గిళ్ల నరేశ్	20.1.2024	యాదాద్రిభువనగిరి
2. తడక శ్రీనివాస్	13.03.2024	సిరిసిల్ల
3. పెంటి వెంకన్న	17.03.2024	ఖమ్మం
4.సిరిపురం లక్ష్మీనారాయణ	07.04.2024	సిరిసిల్ల
5.ఈగ రాజు	25.04.2024	సిరిసిల్ల
6.ఆదిచర్ల సాయి	26.04.2024	సిరిసిల్ల
7.అంకరపు మల్లేశం	26.04.2024	సిరిసిల్ల
8.వెంకటేశం	16.06.2024	కరీంనగర్
9.కుడిక్యాల నాగరాజు	22.06.2024	సిరిసిల్ల
10. నరేశ్	26.06.2024	సిరిసిల్ల
11. పల్లె యాదగిరి	03.07.2024	సిరిసిల్ల
12. ఏలె శంకరయ్య	12.07.2024	నల్లగొండ

రాష్ట్రంలో నేతన్నల వివరాలు

- యాన్సిలరీ వర్కర్లు సహా చేనేత కార్మికులు : 40,533
- పవర్‌లూమ్స్‌పై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు : 35,762
- చేనేత సహకార సంఘాలు : 336
- చేసేత సహకార గ్రూపులు : 615
- పవర్‌లూమ్ సహకార సంఘాలు : 157
- గార్మెంట్ సొసైటీలు : 122

ఈసెట్‌లో 3,511 సీట్లు ఖాళీ

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): టీజీఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల అడ్మిషన్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ముగిసింది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో కలిపి మొత్తం 3,511 సీట్లు ఖాళీగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈసెట్‌కు 22,365 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వారిలో ఈ నెల 17 నుంచి తొలి, చివరి దశల్లో కలిపి 14,212 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. చివరి దశలో 9,646 మందిని ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్‌లో 12,785, ఫార్మసీలో 1,180 సీట్లు ఉండగా, 10,454 సీట్లను విద్యార్థులకు కేటాయించారు. ఇంజినీరింగ్‌లో 2,378, ఫార్మసీలో 1,133 సీట్లు ఖాళీగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా ఆదివారం నుంచి ఈ నెల 24 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

సజావుగా సింగరేణి పరీక్షలు

12,045 మంది అభ్యర్థుల హాజరు

హైదరాబాద్, జూలై 21(నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో 272 ఖాళీల భర్తీకి రెండ్రోజులపాటు నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ఆదివారం సజావుగా ముగిశాయి. శనివారం మూడు షిఫ్టుల్లో నిర్వహించిన పరీక్షలకు 11,724 మంది దరఖాస్తు చేసుకోగా 7,073 మంది, ఆదివారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించగా 6,931 మందికి 4,972 మంది హాజరయ్యారు. మొత్తం 18,665 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా 12,045(65శాతం) మంది పరీక్షలు రాసినట్టు అధికారులు వెల్లడించారు.

షోలాపూర్ వ్యాపారి చేతివాటం!

- పల్లీలు కొన్నాడు.. కోట్లకు ఎగనామం పెట్టాడు
- లబోదిబోమంటున్న గద్వాల వ్యాపారులు
- తెలుగు రాష్ట్రాల్లో వంద కోట్లకు పైగా కుచ్చుటోపీ!

గద్వాల అర్బన్, జూలై 21 : ఓ వ్యాపారి కోట్లాది రూపాయల విలువైన పల్లీలు (వేరుశనగ) కొనుగోలు చేసి.. వాటికి డబ్బులు చెల్లించకుండా ఎగనామం పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని షోలాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొన్నేండ్లుగా పల్లీల వ్యాపారం చేస్తున్నాడు. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని వ్యాపారుల నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల్లో పెద్ద మొత్తంలో పల్లీలు కొనుగోలు చేశాడు. నెలరోజుల్లో డబ్బులు చెల్లించాల్సి ఉండగా కనిపించకుండా వెళ్లిపోయాడు. డబ్బుల కోసం వ్యాపారికి ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో వ్యాపారులు షోలాపూర్‌కు వెళ్లి డబ్బులు చెల్లించాలని సదరు వ్యక్తిని నిలదీశారు. 'నా దగ్గర లేవు.. డబ్బులు ఉన్నప్పుడు చెల్లిస్తా' అని నమ్మబలికాడు. నెలల గడుస్తున్నా.. ఎలాంటి స్పందన లేదు. ఈ క్రమంలో ఆ వ్యక్తి గురించి అసలు విషయం బయటపడింది. ఈ వ్యాపారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో దాదాపు రూ.100 కోట్లకు పైగా పల్లీలు కొనుగోలు చేసి నగదు చెల్లించకుండా తిరుగుతున్నట్టు తెలిసింది. గద్వాల మార్కెట్‌లో దాదాపు 15 మంది వ్యాపారులకు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ డబ్బులను ఎలాగైనా రాబట్టుకోవాలని వ్యాపారులు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. తాము అప్పు చేసి వ్యాపారం చేస్తున్నామని, సదరు వ్యాపారిని నమ్మి పల్లీలు అమ్మితే నిలువునా మోసం చేశాడని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ వ్యవహారంలో గద్వాలకు చెందిన ఓ వ్యాపారికి అత్యధికంగా రూ.1.75 కోట్లు ఇవ్వాల్సి ఉండటంతో తన పరిస్థితి ఘోరంగా ఉన్నదని గంజ్ అసోసియేషన్ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పారు.

అకౌంట్ల అన్‌ఫ్రీజ్‌పై త్వరలో నిర్ణయం

- బాధితుల వివరాల సేకరణపై సీఎస్‌బీ దృష్టి
- పత్యేక సెల్ ఏర్పాటు చేసే యోచనలో సీఎస్‌బీ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : సైబర్ నేరాల్లో నేరుగా పాల్గొనకపోయినా, నేరస్తుల నుంచి డబ్బులు కోల్పోకపోయినా, ఈ రెండు వర్గాలతో ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం లేని కొందరు బాధితుల బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అవుతున్న ఉదంతాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దృష్టి సారించింది. ఎవరో డబ్బులు పంపితే.. ఇంకెవరో ఫిర్యాదు చేస్తే.. వేరే ఎవరివో బ్యాంకు ఖాతాలు స్తంభించిపోతున్న ఈ కేసులు తెలంగాణలో ఈ మధ్య వెలుగు చూస్తుండటంతో వీటి పరిష్కారానికి ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇట్లాంటి బాధితుల పక్షాన నమస్తే తెలంగాణ ఆదివారం 'నేరం చేయకున్నా నిందితుడే' అనే శీర్షికన ఓ కథనం ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అకౌంట్ల అన్‌ఫ్రీజ్‌పై సమాలోచన చేస్తున్నట్టు తెలిపారు. ఆ కథనంలో పేర్కొన్న ఓ బాధితుడికి స్వయంగా సైబర్ క్రైమ్ పోలీసులే కాల్ చేసి, వివరాలు తీసుకున్నారు. బ్యాంకు ఖాతా అన్‌ఫ్రీజ్ చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో యంగల నాగరాజు అనే బాధిత యువకుడు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపాడు. క్రెడిట్ కార్డులు ఇస్తామనో, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్, రమ్మీ గేమ్స్, ఫ్రీ ఫైర్, పబ్జీ వంటి ఆన్‌లైన్ గేమ్స్‌ను నిర్వహిస్తున్న చైనా సైబర్ ముఠాలు.. ముగ్గులోకి లాగేందుకు ఎంతోకొంత నగదు ఖాతాల్లో వేస్తున్నారు. అలా వచ్చిన నగదును బాకీలు ఇవ్వాల్సిన వారికి చెల్లిస్తుండటంతో.. అనూహ్యంగా డబ్బులు రిసీవ్ చేసుకున్న బ్యాంకు ఖాతాలు కూడా స్తంభించిపోతున్నాయి. తాజాగా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచింగ్ స్టాఫ్‌గా ఉన్న మాధురి బ్యాంకు ఖాతా కూడా స్తంభించిపోయింది. ఇట్లాంటి బాధితులు ఎక్కువమందే ఉంటారని గ్రహించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు.. బాధితులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి బాధితుల అకౌంట్ల వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న 'బాల్' అధిపతి గణేశన్

700 కోట్లతో అల్యూమినియం టిన్నుల యూనిట్

- 500 మందికి ఉపాధి కల్పించనున్న బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ సంస్థ
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : బీర్లు, శీతల పానీయాలు, పెర్‌ఫ్యూముల పరిశ్రమలకు అల్యూమినియం టిన్నులను సరఫరా చేసే బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ కంపెనీ రాష్ట్రంలో రూ.700 కోట్ల పెట్టుబడితో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. దీని ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 'బాల్' ఇండియా కార్పొరేట్ వ్యవహారాల అధిపతి గణేశన్ ఆదివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెట్టుబడుల పూర్తి ప్రణాళికను సమర్పించాలని గణేశన్‌కు సూచించారు. రాష్ట్రంలో 'బాల్' సంస్థకు అవరసరమైన భూమితోపాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రానికి టిన్నుల ద్వారా సరఫరా అవుతున్న బీర్లు మహారాష్ట్రలో బాట్లింగ్ అవుతున్నాయని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో బీర్లను టిన్నుల్లో బాట్లింగ్ చేయాలంటే ఎక్సైజ్ విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుందని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తోపాటు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో చర్చిస్తానని చెప్పారు. 500 ఎంఎల్ బీర్ల టిన్నులతో ఎక్సైజ్ సుంకం తగ్గి ప్రభుత్వానికి ఏటా రూ.285 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో బాట్లింగ్ యూనిట్ ఏర్పాటుకు కోకా కోలా కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందని, రూ.1000 కోట్లతో యూనిట్‌కు 'బాల్' సంస్థ అల్యూమినియం టిన్నులను సరఫరా చేస్తుందని వివరించారు.

విదేశీ విద్యానిధి ఎప్పుడు?

- 7 నెలల క్రితమే ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- ఇప్పటికీ ప్రకటించని లబ్ధిదారుల జాబితా
- బడ్జెట్‌లో రూ.21 కోట్లు కేటాయించినా విడుదల చేసింది మాత్రం రూ.15 కోట్లే
- మార్గదర్శకాల విడుదలలో ఎడతెగని జాప్యం
- విద్యాభ్యాసం ముగుస్తున్నా అందని ఆర్థిక సాయం
- విదేశాల్లో తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులు

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): విదేశీ విద్యానిధి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ ఎప్పుడు అందుతుందా? అని ఎదురుచూస్తున్నారు. అసలు వస్తుందా? రాదా? ప్రభుత్వం ఇస్తుందా? ఇవ్వదా? అని ఆందోళనకు గురవుతున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి 7 నెలలు గడుస్తున్నా, విదేశాల్లో అభ్యాసం పూర్తయ్యేందుకు సమయం దగ్గరపడుతున్నా తుది జాబితాపై ఇప్పటికీ అతీగతీ లేకుండాపోవడమే ఇందుకు కారణం. మరోవైపు స్కాలర్‌షిప్‌పై ఆశతో అప్పులు చేసి తమ పిల్లలను విదేశీవిద్య కోసం పంపిన తల్లిదండ్రులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తుది జాబితా ఎప్పుడు ప్రకటిస్తారని బీసీ సంక్షేమశాఖ అధికారులను అడిగితే.. ప్రభుత్వం నుంచి ఇంకా కొత్త మార్గదర్శకాలు రాలేదని, అవి వచ్చే వరకూ ఏమీ చేయలేమని తేల్చిచెప్తున్నారు.

గత ఫాల్ సీజన్‌కు 2,665 మందికి దరఖాస్తు

పేదింటి బీసీ బిడ్డలు విదేశాల్లో మాస్టర్స్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులను అభ్యసించేందుకు వీలుగా గతంలో కేసీఆర్ ప్రభుత్వం జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి సంవత్సరం జనవరి (ఫాల్ సీజన్)లో 150 మంది, ఆగస్టు (స్ప్రింగ్ సీజన్)లో 150 మందికి కలిపి మొత్తంగా 300 మందికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేయడంతోపాటు వీసా చార్జీలు, ప్రయాణ ఖర్చుల నిమిత్తం గరిష్ఠంగా రూ.50 వేల చొప్పున అందజేసింది. కాగా, బీసీ ఓవర్సీస్ పథకం కింద గత ఫాల్ సీజన్‌కే 2,665 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,023 మంది బీసీలు, 642 మంది ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులున్నారు. వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జనవరిలోనే పూర్తయినప్పటికీ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన అర్హుల జాబితాను మాత్రం ఇప్పటికీ ప్రకటించలేదు.

విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు

కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించని విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. అకడమిక్ మార్కులకు 60%, జీమ్యాట్/జీఆర్ఈ 20%, టోఫెల్, ఐఎల్స్, పీటీఈ పరీక్షల్లో వచ్చిన మార్కులకు 20% వెయిటేజీ ఇచ్చి, ఆ మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీంతో ఆయా అర్హతలున్న విద్యార్థులు తమకు తప్పకుండా స్కాలర్‌షిప్ వస్తుందన్న ధీమాతో విదేశాల్లో విద్యనభ్యసించేందుకు వెళ్లారు. అదే ధీమాతో పలువురు తల్లిదండ్రులు అప్పులు తెచ్చి తమ పిల్లలను విదేశాలకు పంపారు. ఇలా గత ఫాల్ సీజన్‌కు దరఖాస్తు చేసుకుని విదేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో పలువురు ఇప్పటికే 2 సెమిస్టర్లను పూర్తిచేసుకోగా.. మరికొందరికి త్వరలో మూడో సెమిస్టర్ కూడా పూర్తికానున్నది. అయినా ప్రభుత్వం ఇప్పటికీ ఆర్థిక సాయం ప్రకటించలేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.21 కోట్లు కేటాయించినప్పటికీ రూ.15 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఆ నిధులతో గతంలో ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేందుకు సైతం సరిపోని పరిస్థితి నెలకొన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి.

కొత్త మార్గదర్శకాలు వచ్చేదెప్పుడు?

వాస్తవానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తవగానే మెరిట్ జాబితాను రూపొందించి స్టేట్ లెవల్ స్క్రీనింగ్ కమిటీకి పంపాల్సి ఉంటుంది. ఆ కమిటీలోని సంబంధిత విభాగం అధికారులతోపాటు, హయ్యర్, టెక్నికల్ ఎడ్యుకేషన్, జేఎన్టీయూకి చెందిన సభ్యులు అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం ఫాల్ సీజన్‌కు సంబంధించి మెరిట్ జాబితానే అధికారులు ఇంకా రూపొందించలేదని తెలుస్తున్నది. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం మార్గదర్శకాలను మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమైనట్టు అధికారులు వెల్లడించారు. ఏటా 300 మందికి కాకుండా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని, విదేశాల్లోని టాప్-500 యూనివర్సిటీల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని, పన్ను చెల్లింపుద